క్లుప్తంగా

నెమలి వాహనంపై గ్రామోత్సవం



నెమలి వాహనంపై సుబ్రహ్మణ్యేశ్వరుడి గ్రామోత్సవం

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని నెమలి వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు మల్లేశ్వర శర్మ ఆధ్వర్యంలో షష్ఠి మహోత్సవం పురస్కరించుకుని ఈ గ్రామోత్సవాన్ని చేపట్టారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు



చంద్రేడులో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి దేవాలయంలో స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ ఆధ్వర్యంలో అభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కళాకారులకు జ్ఞాపికలు అందజేత



కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఉత్సవ కమిటీ చైర్మన్ వాసు

బిక్కవోలు: షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. నగర సంకీర్తనతో స్వామి రథోత్సవంలో కోలాటం ఆడిన బృందం కళాకారులకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు జ్ఞాపికలు అందించారు. కళాకారులు చక్కటి ప్రదర్శనతో పలువురి మన్ననలు అందుకున్నారు. ఆలయం వద్ద నిర్వహించిన కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సినీ మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశారు.

రహదారికి మరమ్మతులు



రాజానగరంలో పాత ఎన్‌హెచ్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

రాజానగరం: గ్రామంలోని పాత ఎన్‌హెచ్ రహదారికి మరమ్మతులు చేపట్టారు. వర్షాలకు పాడైన ఈ రహదారిపై పలు ప్రాంతాలలో గోతులు పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. అయితే ఈ రహదారిపై టెలీఫోన్ ఎక్స్ఛేంజ్, సినిమా థియేటర్, జెడ్పీ అతిథి గృహం ప్రాంతాలలో కూరుకుపోయిన తూరల స్థానంలో కల్వర్టులు కూడా నిర్మించి, సాయిబాబా గుడి సెంటర్‌లో రహదారిని ఎత్తు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలపై రెండు అర్జీలు

సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు వచ్చాయని ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. నాగంపల్లి రెవెన్యూలో ఉన్న తన భూమి ఆన్‌లైన్ అవ్వలేదని, సత్వరమే ఆన్‌లైన్ చేయాలని కోరుతూ రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామానికి చెందిన వై.సాంబమూర్తి అర్జీ పెట్టుకున్నారు. అలాగే రాపాకలో విద్యుత్ స్తంభాలు ఒరిగి, వైర్లు వేలాడుతున్నాయని, వాటిని సరిచేయాలని ఆ గ్రామానికి చెందిన ఎస్.లాజర్ అర్జీ పెట్టుకున్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి ఫిర్యాదులు అందలేదు. స్థానిక తహసీల్దార్ రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్, తహసీల్దార్ సుస్వాగతం, ఈఓపీఆర్డీ మహేశ్వర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రైతు చూపు.. శనగ సాగు వైపు..!

- 25 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ
- మండలంలో 800 ఎకరాల్లో సాగుకు సిద్ధం
- ధర ఆశాజనకంగా ఉండటంతో ఆసక్తి



పొలంలో ట్రాక్టర్ సహాయంతో విత్తనాలు చల్లుతున్న రైతు

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో గల నల్లరేగడి నేలల్లో శనగ సాగులో రైతులు బిజీగా ఉన్నారు. శనగల ధర ఆశాజనకంగా ఉండటంతో మండల రైతులు ఈ పంటను అధికంగా సాగు చేస్తున్నారు. మండలంలోని వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లో 800 ఎకరాల విస్తీర్ణంలో రబీలో ఆరుతడి పంటగా రైతులు శనగ సాగు చేపట్టారు. చలికాలంలో వేసే శనగ సాగుకి ఒకటి, రెండు నీటి తడులు సరిపోతాయి. ఎక్కువగా మంచుకు శనగ మొక్కలు ఎదుగుతాయి. నల్లరేగడి నేలల్లో శనగ సాగుకు అధిక దిగుబడి వస్తుండటంతో కౌలు రైతులు కూడా ఈ పంట సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో నల్లరేగడి నేలల్లో సాగు చేసిన వరి, మినుము పంటలను ఒబ్బిడి చేసుకున్న రైతులు ప్రస్తుతం శనగ సాగులో తలమునకలయ్యారు. కొందరు రైతులైతే వేసిన పత్తి పంటను సైతం దున్నేసి దాని స్థానంలో శనగ సాగు చేయడానికి పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ పంటను ఒబ్బిడి చేసుకున్న అనంతరం శనగ సాగు చేయడానికి రైతులు ముందుగా పొలాన్ని ట్రాక్టర్లతో దుక్కి దున్ని నీటి తడులు పెడుతున్నారు. కొంతమంది రైతులు బోరు నీటిలో తడులు పెడుతుండగా బోర్లులేని రైతులు కాలువ ద్వారా వస్తున్న నీటిని ఇంజన్లతో తోడుకుని పొలాలకు మళ్లిస్తున్నారు. ప్రస్తుతం చంద్రేడు, పెదరాయవరం, రంగంపేట, వడిశలేరు గ్రామాల్లో రైతులు ఈ పనుల్లో బిజీగా ఉన్నారు.

జగనన్న ప్రభుత్వంలో చేయూత

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్నదాతలకు అనేక విధాలుగా చేయూత నందించిన విషయం అందరికీ తెలిసినదే. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచింది. దీంతో పాటు శనగ పంటకు సరైన మద్దతు ధరను ప్రకటించింది. స్థానిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనగ విత్తనాలను 50 శాతం రాయితీపై రైతులకు అందించారు. మండలంలో మొత్తం 63 టన్నుల శనగ విత్తనాలను రైతులకు అందించారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం కేవలం 25 శాతం రాయితీని మాత్రమే అందిస్తోంది. శనగ సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో శనగ సాగుకు సుమారు రూ.10 వేలు ఖర్చవుతుంది. కౌలు రైతులు అదనంగా రూ.12 నుంచి 15 వేలు కౌలు చెల్లించాల్సి ఉంది.



శనగ విత్తనాలను ట్రాక్టర్‌కు అమర్చిన యంత్రంలో వేస్తున్న రైతు

జాగ్రత్తలు పాటించాలి



శనగ పంట సాగు చేసే రైతులు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చు. పొలాన్ని దుక్కి దున్నేటప్పుడే లద్దె పురుగు ఆశించకుండా నివారణా చర్యలు చేపట్టాలి. అందుకోసం దుక్కిలోనే క్లోరిపైరికాస్ మందును 200 మిల్లీ గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మొక్కలు ఎదిగే దశలో వేర్లకు కుళ్లి తెగులు ఆశిస్తుంది. దీనిని సకాలంలో గుర్తించి అరికట్టాలి. లేకపోతే చేనుకు నష్టం వాటిల్లుతుంది. దీని నివారణకు టెక్లో బెలలాక్స్ పైఢర్ మందును మొక్కలపై జల్లాలి. – కె. శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి, రంగంపేట

12 నుంచి రెవెన్యూ సదస్సులు

సీతానగరం: రెవెన్యూ సదస్సులు ఈ నెల 12వ తేదీకి వాయిదా పడ్డాయని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల సచివాలయంలో సదస్సులు నిర్వహిస్తామన్నారు. 12న ములకల్లంక సదస్సును బొబ్బిల్లంక సచివాలయం-2లో, 13న మిర్తిపాడు, 16న రఘుదేవపురం, 18న మునికూడలి, 19న చినకొండేపూడి, 20న కాటవరం, జాలిమూడి సదస్సులు కాటవరం సచివాలయంలో జరుగుతాయన్నారు. 21న సీతానగరం, 23న సింగవరం, 26న నాగంపల్లి, 28న నల్గొండ, రాపాక (రాపాక సచివాలయం), 30న వంగలపూడి, జనవరి 2న పురుషోత్తపట్నం, 3న ఉండేశ్వరపురం, 4న కూనవరం, 7న ముగ్గళ్ల, 8న బొబ్బిల్లంక సచివాలయంలో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సదస్సులు ప్రారంభిస్తామని, భూ సమస్యలపై రైతులు అర్జీలు అందజేయవచ్చన్నారు.

బిక్కవోలు: ఈ నెల 12వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణ తెలిపారు. 12న ఇలపల్లి, తుమ్మలపల్లి, రాళ్లగండిక గ్రామాల్లోనూ, 16న రంగాపురం, 17న బలభద్రపురం, 18న తొస్సిపూడి, 20న కాపవరం, 23న ఆరికరేవుల, 26న మెళ్లూరు, 28న కొమరిపాలెం, 30న పందలపాక, జనవరి 2న కొంకుదురు, 4న ఊలపల్లి, 6న ఆర్ఎస్‌పేట, 8న బిక్కవోలు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జరగనున్న ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఏసురాణి

సీతానగరం: ప్రధానమంత్రి స్వాత్య మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్య సేవలు అందించారు. డాక్టర్ ఈ.ఏసురాణి ఆధ్వర్యంలో 44 మందికి పరీక్షలు జరిపారు. అవసరమైన రక్త పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వారిలో ఆరుగురిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏసురాణి మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా నెలకొకసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. సక్రమంగా పౌష్టికాహారం తీసుకుంటూ ప్రశాంతంగా ఉండాలన్నారు. సత్యసాయి సేవా విభాగం ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్లు జి.దైవకృప, కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

- హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- హోరాహోరీగా తలపడ్డ క్రీడాకారులు



బెలూన్లు ఎగురవేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



ఉత్కంఠగా సాగుతున్న వాలీబాల్ మ్యాచ్

పెదపూడి: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలిగి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. జి.మామిడాడలోని డీఆర్‌కే రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజీ వాలీబాల్ టోర్నమెంట్ యూనివర్సిటీ టీం ఎంపికలను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే నల్లమిల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనివర్సిటీ పరిధిలో వివిధ కాలేజీల నుంచి వచ్చిన వాలీబాల్ పురుషుల జట్లు మార్చిఫాస్ట్ నిర్వహించి ఎమ్మెల్యేకు గౌరవ వందనం అందించారు. టోర్నమెంటులో మొత్తం 26 జట్లు పాల్గొన్నాయి. మొదటి మ్యాచ్ స్థానిక డీఆర్‌కే రెడ్డి, తణుకు జట్ల మధ్య ప్రారంభమైంది. కార్యక్రమంలో డీఆర్‌కే విద్యా సంస్థల ఫౌండర్ డీఆర్‌కే రెడ్డి, కరస్పాండెంట్ ద్వారంపూడి వివేకానందరెడ్డి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ టీ.శ్రీనివాసారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకట్రావు, యూనివర్సిటీ అబ్జర్వర్ సత్యనారాయణ, కమిటీ మెంబర్లు పవన్ కుమార్‌రాజు, అనిల్, కూటమి నాయకులు తమలంపూడి శివరామారెడ్డి, ఆర్.నాగు, జుత్తుక కృష్ణ, సింగినీడి దత్తుడు, పీడీలు బంగార్రాజు, రవి రాజు, ధనరాజ్, యువరాజారెడ్డి, సూరారెడ్డి, రాఘవరెడ్డి, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రముఖులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 13, 14 తేదీల్లో అథ్లెటిక్స్ చాంపియన్ కం యూనివర్సిటీ టీమ్ పోటీలు జరగనున్నాయని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం విడుదల చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో తొలిసారిగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు అనుబంధ కళాశాలల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ వంటి మూడు విభాగాలలో జరిగే 24 ఈవెంట్లలో పురుషులు, మహిళలు పోటీపడతారన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కె.సుబ్బారావు, సెక్రటరీ చొల్లంగి వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ

ధవళేశ్వరం: దివ్యాంగులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అన్నారు. ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్, అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి, స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం ఎస్సై క్రాంతి కుమార్ విచ్చేశారు. తొలుత కేక్ కట్ చేసి దివ్యాంగులకు తినిపించారు. అనంతరం వీల్ చైర్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన పరికరాల కోసం సంప్రదిస్తే, అర్హులకు అందిస్తామన్నారు. ఎస్సై క్రాంతి కుమార్ మాట్లాడుతూ స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆళ్ల ఆనందరావు, అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్ కుమార్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షుడు పలివెల రాజు, దివ్యాంగుల హక్కుల వేదిక ఉద్యోగుల విభాగం చైర్మన్ సూరంపూడి మాణిక్యాలరావు, నాయకులు కండెల్లి రజనీ కుమార్, ర్యాలీ శివ, కృప, కండేపల్లి వీరరామ సాగర్ పాల్గొన్నారు.

గ్రామ సర్వేయర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవు



రాజమహేంద్రవరం ఆర్డీవో ముఖేష్ కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఏపీఎస్ఈఏ నాయకులు

మధురపూడి: గ్రామ సర్వేయర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవని ఆంధ్రప్రదేశ్ సర్వేయర్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీఎస్ఈఏ) జిల్లా ఉపాధ్యక్షుడు కొండా ఆనంద్ అన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ దీనిపై జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, సర్వే విభాగం జిల్లా అధికారి పీఎల్ నారాయణ, ఆర్డీవో ముఖేష్ కుమార్‌లను కోరినట్టు తెలిపారు. అలాగే ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, బీజేపీ నాయకుడు సోము వీర్రాజులకు వినతి పత్రాలు అందించామన్నారు. కోరుకొండ మండలంలోని గ్రామ సర్వేయర్లను కొందరు మండల అధికారులు చులకన భావంతో చూస్తున్నారన్నారు. రైతుల సమక్షంలో సర్వేయర్లను అవమానిస్తున్నారన్నారు. దీనిపై మనస్తాపం చెంది, కోరుకొండ సచివాలయంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ముళ్ల ఆనంద్ కుమార్ ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. సర్వేయర్లకు రక్షణ కల్పించాలని, అధికారుల ఒత్తిడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి యామినీ ముఖర్జీ తదితరులు ఉన్నారు.

అభ్యాసకులకు అడుగడుగునా మార్గనిర్దేశం



మాట్లాడుతున్న ప్రాంతీయ సంచాలకులు కృష్ణారావు

కంబాలచెరువు: అభ్యాసకులందరికీ అడుగడుగునా మార్గనిర్దేశం చేసేందుకు సమగ్రమైన వనరులు, అంకితభావం కలిగిన అధ్యాపకులు, సిబ్బందితో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రం (ఇగ్నో) పనిచేస్తోందని ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ కృష్ణారావు పేర్కొన్నారు. 2024 – 25 విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారికి అధ్యయన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇండక్షన్ ప్రోగ్రామ్‌కు ఆయన సోమవారం ముఖ్య అతిథిగా విచ్చేశారు. అధ్యయన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎం.గౌతమ్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా లక్షల మంది ఔత్సాహిక అభ్యాసకులకు విద్య, వృత్తి పరమైన, వ్యక్తిగత లక్ష్యాలు సాధించడానికి ఐజీఎన్‌ఓయూ మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. అందరికీ విద్య అందుబాటులో ఉండేలా కృషి చేస్తుందన్నారు. దీనికి ఎప్పటికప్పుడు అభివృద్ధి పర్చిన స్టడీ మెటీరియల్, కౌన్సెలింగ్ సెషన్లు, డిజిటల్ ఆడియో, వీడియో సపోర్ట్‌ను అందిస్తోందన్నారు. ఐజీఎన్‌ఓయూ జ్ఞానదర్శన్, జ్ఞాన్ కోష్, జ్ఞాన్ ధార వంటి వెబ్ ఆధారిత పోర్టల్, కార్యక్రమాలను క్రమం తప్పకుండా వీక్షించాలన్నారు.

పునాది విద్యతోనే విద్యార్థి భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్ రాష్ట్ర కన్సల్టెంట్ బాలకృష్ణ

- ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర కన్సల్టెంట్ బాలకృష్ణ
- నాలుగో దశ శిక్షణ ప్రారంభం

రాజానగరం: విద్యార్థి భవిష్యత్తును పునాది అభ్యసనమే నిర్దేశిస్తుందని ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ప్రోగ్రామ్ రాష్ట్ర కన్సల్టెంట్ టి.బాలకృష్ణ అన్నారు. కొండగుంటూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ 4వ దశ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2030 నాటికి సాధించాల్సిన సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌లో భాగంగా ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నాణ్యమైన విద్యను పొందాల్సి ఉందన్నారు. ఇదే విషయాన్ని నూతన జాతీయ విద్యా విధానం కూడా వివరిస్తుందన్నారు. రాష్ట్ర కో ఆర్డినేటర్ గీతారమ్య మాట్లాడుతూ ఒకటో తరగతి బోధన చేసే ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులవుతారన్నారు. ట్రైనింగ్ ప్రోగ్రాం కోర్సు కో ఆర్డినేటర్, కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ బాల్య దశగా భావించే మొదటి ఎనిమిది సంవత్సరాలు విద్యార్థి జీవితానికి అత్యంత కీలకమన్నారు. ఈ దశలోనే మానసిక అభివృద్ధి, అభ్యసన వేగంగా ఉంటాయన్నారు. ఈ శిక్షణకు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 250 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ డి.రమేష్ బాబు, మండల విద్యాశాఖాధికారులు, కెఆర్పీలు, డీఆర్పీలు పాల్గొన్నారు.

డోలీపై కోరుకొండ నరసన్న దర్శనం



డోలీలో వృద్ధురాలిని కొండపై నుంచి తీసుకుని వస్తున్న శ్రామికులు



డోలీ దిగుతున్న భక్తురాలు కృష్ణాబాయి

మధురపూడి: చార్‌ధామ్, అమర్‌నాథ్ వంటి యాత్రల్లో భగవంతుని దర్శనానికి డోలీని వినియోగించడం చాలా మందికి తెలిసిందే. ఇటువంటి సన్నివేశం కోరుకొండలో కూడా చోటు చేసుకోవడం పలువురిని ఆశ్చర్యపరచింది. మండలంలోని కాపవరానికి చెందిన 90 సంవత్సరాలు పైబడిన రెంటాల కృష్ణాబాయి తన కుటుంబ ప్రయోజనార్థం కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామికి మొక్కుకున్నారు. తన కోరిక తీరడంతో కొండపై స్వయంభువుగా వెలసిన స్వామివారిని దర్శించాలని అనుకున్నారు. అయితే, వృద్ధాప్యంతో వందలాదిగా మెట్లు ఎక్కి, కొండ పైకి చేరుకోవడం అసాధ్యం కావడంతో రూ.6 వేల కిరాయికి డోలీ ఏర్పాటు చేసుకున్నారు. ఆ డోలీ సాయంతో ఆదివారం కొండ పైకి వెళ్లి, స్వామివారిని దర్శించుకున్నారు. డోలీ మోసిన శ్రామికులు కృష్ణాబాయిని కొండ పైకి తీసుకుని వెళ్లి, క్షేమంగా కిందికి దింపారు. సోమవారం వెలుగులోకి రావడంతో స్థానికంగా ఈ విషయం చర్చనీయాంశమైంది.

అర్జీలకు చట్టపరిధిలో పరిష్కారం

కంబాలచెరువు: పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలను నిర్దేశించిన సమయంలో చట్టపరిధిలో పరిష్కరించాలని అధికారులకు ఎస్పీ డి.నరసింహ కిశోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తరలి వచ్చారు. తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. వారి కష్టాలను, బాధలను ఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలన్నారు.

కాగా.. పీజీఆర్ఎస్‌కు 28 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్, కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాట, దొంగతనం తదితర కేసులకు సంబంధించినవి ఉన్నాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) అల్లూరి వెంకట సుబ్బరాజు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) ఎల్.అర్జున్, ఇన్‌స్పెక్టర్ (ఎస్‌బీ) శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ (డీసీఆర్‌బీ) పవన్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాతావ'రణం'పై రైతులను అప్రమత్తం చేశాం

- 10 వేల టార్పాలిన్లు సిద్ధం
- కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్న రాముడు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా రైతులను అప్రమత్తం చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జాయింట్ కలెక్టర్ చిన్న రాముడుతో కలసిన తన క్యాంపు కార్యాలయంలో ఆమె సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతుల ధాన్యం తడిసిపోకుండా 10,100 టార్పాలిన్లు సిద్ధంగా ఉంచామని చెప్పారు. వీటిని రైతులకు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లావ్యాప్తంగా 18 మండలాల్లోని 221 రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 2.30 మెట్రిక్ లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనేది లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 209 కేంద్రాల ద్వారా రూ.467.30 కోట్ల విలువైన 2,03,256 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 25,365 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని వివరించారు. జిల్లాలోని 91 శాతం రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.420.63 కోట్లు 48 గంటల్లోగా జమ చేశామని చెప్పారు. రైతుల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు 2 వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మరో రెండు రోజుల్లో రైతుల నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇప్పటి వరకూ 54 లక్షల గోనెసంచులు అందించామని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. కాగా, కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై కలెక్టర్ తదితరులు 170 అర్జీలు స్వీకరించారు.